చేస్తున్నారో వారు దేవునిదయకు పాత్రులవుతారు. ఈశ్వరునిదయకు పాత్రులేకాదు వారసులవుతారు. పిడతమట్టిలోనే ఉండి అది తెలియక మట్టికి భిన్నంగా ఉన్నాను అనుకొంటోంది. మట్టి కంటే భిన్నంగా ఉన్నాను అన్న సంగతి నిజంకాదు. అది ఒక తలంపు. ఆతలంపు పిడతకు దుఃఖాన్ని తీసుకొని వస్తోంది. ఆపిడతకథ మనకథ ఒకటే. నువ్వు ఆత్మలోనే ఉండి ఆత్మకు భిన్నంగా ఉన్నాను అనుకొంటున్నావు. గురువు చేసే సహాయం ఏమిటి అంటే నీకుఅంతర్‌దృష్టిని కలుగజేసి ఆభిన్నతలంపును, వేరుభావనను తొలగిస్తాడు. నీవు చేసే జపంవలన, ధ్యానంవలన దేహబుద్ధి తగ్గాలి. నీసాధనలవలన దేహబుద్ధి పెరుగుతూ ఉంటే ఆసాధనలవలన ప్రయోజనం ఏముంది. నీవు మందులు వాడటం వలన నీరోగం తగ్గాలి అంతేగాని మందులు వాడటంవలన నీకు రోగం పెరుగుతూ ఉంటే ఆ మందులు వాడటం ఎందుకు అంటున్నారు. కొబ్బరికాయ తయారవ్వటానికి కొంతటైము పడుతుంది కాని అది పక్వానికి వచ్చినతరువాత చెట్టునుండి రాలటం కొన్నిక్షణాలలో రాలిపోతుంది. అలాగే నీసాధనకు కొంతటైము పడుతుంది. కాని లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రావటం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది. భిన్నభావన నశించటం నీవు ఆనందంలో ఐక్యమవ్వటం ఇవన్నీ కొన్ని క్షణాలలో జరిగిపోతాయి. అయితే నీహృదయంలో ఉన్న నిజం దగ్గరకు వెళ్ళేవరకు కృషి విషయంలో నీకు అశ్రద్ధపనికి రాదు. బట్టకు చిల్లులు పడితే ఆప్రక్క ఉన్న మనుషులనుచిల్లులోనుండి కొంచెం కొంచెం చూడవచ్చు. అలాగే మూలతలంపు పూర్తిగా నశించకపోయిన అది కొంచెందారి ఇచ్చింది అనుకోండి లోపల ఉన్న వస్తువు తాలూక మాధుర్యాన్ని కొంచంరుచి చూసావు అనుకో మరల ఆఆనందాన్ని ఎప్పడు పొందుతాము, ఎప్పడు హృదయంలో మనం లయమవుతాము అని మనస్సు ఎదురుచూస్తుంది. నీకు ఆత్మజ్ఞానం కలిగినప్పడు, ఆత్మానందం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు, నీవు ఆనందసముద్రంలో ఊగిసలాడుతున్నప్పడు దేవతలకు అధిపతి అయిన యింద్రుడుకూడా నిన్ను చూసి అసూయపడతాడు, అట్టిది జ్ఞానంయొక్క వైభవం అన్నారు ఆచార్యులవారు. మనం ఎప్పడైనా భగవాన్ దగ్గర బుడబుక్కల మాటలు మాట్లాడుతున్నాము అనుకోండి ఆయన బుడబుక్కల మాటలు అనరు, నువ్వుచెప్పేమాటలు జ్ఞానమా? అంటారు అంటే అది అజ్ఞానం అని చెప్పటం, అది వైభవం. వింటే జ్ఞానంగురించి విను. ఒకవేళ జ్ఞానం గురించి వినవు అనుకో అజ్ఞానం గురించి వినకు. ఒకమాట గుర్తుపెట్టుకోండి. లోపల ఉన్నసత్యం నీకు స్వరూపంగా వ్యక్తమయినప్పడు అంతకంటే పొందవలసింది వేరే ఉంది అనికాని, మనం సాధించవలసింది వేరేఉంది అనికాని, ఏదోవ్యాపకం పెట్టుకొందాము అనిగాని, అలా ఉండాలి ఇలాఉండాలి అనికాని అసలు మీకు ఏమీ అనిపించదు, అట్టిది జ్ఞానం. జ్ఞానితాను ఏదో సంకల్పించి చెయ్యాలని వాడు చెయ్యడు. ఎందుచేతనంటే ఈశ్వరసంకల్పానికి భిన్నంగా జ్ఞాని ఉండడు, జ్ఞానిదేహంద్వారా పనిజరుగుతుంది. ఆఉపాధి ద్వారా జరగవలసినది ఏదో జరుగుతుంది అంతేగాని సంకల్పం ఏమీ అక్కడ ఉండదు. గురువు మనతో మాట్లాడుతూ ఉంటాడు, నవ్వుతూ ఉంటాడు, మనతో కలిసి తింటాడు కాని మనలను హృదయగుహలోనికి తీసుకొనిపోవటానికి చూస్తూఉంటాడు. ఈచూచేవాడిని, చూడబడే దానిని తప్పించి వాటిని ఓవర్‌కమ్ చేసి హృదయం యొక్క లోయలలోనికి, ఆ నగ్నసత్యం దగ్గరకు మోసుకొని పోవటానికి గురువు ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఓంకారం గురించి వేదాలు వర్ణించి చెప్పినాయి. కాని భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చిందా, మూలతలంపు రాకుండా ఓంకారం వచ్చిందా అంటున్నారు. మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చింది అయితే ముందు దానిని పట్టుకో. మూలతలంపును పట్టుకొని దానిని వెంటాడి దాని మూలంలోనికి వెళ్ళు అంటున్నారు భగవాన్.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 1-03-03, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. కాని అవసరాన్ని బట్టి ఒకదేహం ధరించి వస్తాడు. దేహం ధరించినప్పడు కూడా నేను శరీరమాత్రుడను కాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. ఈ రోజు శివరాత్రి. శివరాత్రి అంటే అవ్యక్తమైనటువంటి పరమాత్మ ఒక లింగరూపం ధరించినరోజు. లింగం అంటే గుర్తు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని గుర్తుకోసం లింగరూపం ధరించాడు. మనం దానిని పూజించి, ధ్యానించి, ఆరాధించి ఈ వ్యక్తమయిన లింగరూపం ద్వారా అవ్యక్తంలో ఐక్యమవ్వటంకోసం, మనకు సపోర్టుకోసం భగవంతుడు లింగరూపం ధరించాడు. శివుడు అంటే మంగళ ప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. శివస్మరణ వలన మనం పవిత్రులం అవుతాము. ఉపవాసం అంటే భగవంతుడికి దగ్గరగా ఉండమని, కాని మనం లోకానికి దగ్గరగా ఉంటున్నాము. మనకు దుఃఖం రావటానికి ఒకటే కారణం మనం లోకాన్ని భరించలేకపోతున్నాము. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. వాళ్ళందరిని ఎవరైతే సమన్వయం చేసుకోలేరో, లోకంయొక్క పోకడ ఎవరికైతే అర్థంకాదో వాడు లోకాన్ని భరించలేక దుఃఖపడతాడు. ఈశ్వరుడు అంటే ప్రభువు, నియమించేవాడు, జీవులను వారి కర్మానుసారం నియమిస్తూ

ఉంటాడు. మనం శారీరకబాధపడలేక తొందరగా చనిపోవాలనుకొన్నా ఈ ప్రాణం భయటకు వెళ్ళదు. ఈ శరీరం ఎంతకాలం ఈ భూమిమీద ఉండాలో, ఎన్ని అనుభవాలు పొందాలో అంతవరకు జీవుడు ఈశరీరాన్ని అంటిపెట్టుకొని ఉండేలా చేస్తాడు, వాడు ఈశ్వరుడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని శరణువేడుకో, ఆయన నిన్ను అనుగ్రహిస్తాడు. మీ ఇంట్లో ధనం ఉంటే, బంగారం ఉంటే గుప్తంగా ఉంచుకొంటారు. అవి నాకు కనబడకపోవచ్చు. అంతమాత్రం చేత మీ ఇంట్లో బంగారం లేదు అనికాదు. అలాగే భగవతుడు మనలోపల గుప్తంగా ఉన్నాడు. మీకు కనబడటం లేదు అని ఆయన లేడు అనుకోవద్దు. మీకు భౌతికసంపద ఉంటే, ఆధ్యాత్మికసంపద ఉంటే ఊరేగవద్దు. మీకు భౌతికసంపద ఉంటే ఇతరులకు సహాయం చేయండి, జ్ఞానసంపద ఉంటే ఇతరులకు అర్థమయ్యేలా బోధించండి. భగవంతుడు మీ హృదయంలో ఉన్నాడు. మీ తలంపులకు సాక్షిగా ఉన్నాడు. ఆయన సర్వసాక్షి. ఆయన మీలోపల గుప్తంగా ఉన్నాడు కాబట్టి ఆయనను తెలుసుకోవటం కష్టం. ఆయన మీకు తెలియటంలేదు కాబట్టి ఆయన లేడు అనుకోవద్దు, అలా మోసపోవద్దు. ఆయన లోపల ఉన్నాడు కాని మీకు తెలియటంలేదు అనుకోండి. మీకు తెలియనంతమాత్రంచేత లోపల బ్రహ్మపదార్థం లేదు అని కాదు. శరీరంలో ఎన్ని జబ్బులు ఉన్నాయో లోకంలో అన్ని ఆకర్షణలు ఉన్నాయి. ఈశరీరాన్ని చంపటానికి ఒక్క జబ్బు చాలు. అలాగే మనం పతనమవ్వటానికి ఒక్క ఆకర్షణ సరిపోతుంది. మహ్మద్ ప్రవక్త శరీరం విడిచిపెట్టే సమయంలో నీవు జయించావు, నీవు జయించావు అని మాటలు వినబడుతున్నాయి కాని ఆయనకు మనిషికనబడలేదు. కాని ఎవరు అంటున్నారో ప్రవక్తకు అర్థమయ్యింది. ప్రవక్త ఏమి చెప్పాడు అంటే నాకు ప్రాణంపోవటానికి ఇంకా 5 నిమిషాలు టైముఉంది. ఈ టైములో కూడా మాయలోపడవచ్చు. అందుచేత నీవు జయించావు అని ఇప్పుడు అనటం కాదు. ఈ శరీరం పోయిన తరువాత మహ్మద్ ప్రవక్త మాయను జయించాడు అని చెప్పండి అన్నాడు. శరీరం పోయే చివరిక్షణంలో కూడా మాయలో పడటానికి అవకాశం ఉంది అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. శివుడి మెడలో పాముఉంది, విష్ణువు పాముమీద పడుకొన్నాడు అయినా వారు శాంతిగా ఉన్నారు. ప్రపంచంలో అనేకరకాల మనుషులు ఉంటారు, క్రూరత్వంకూడా చాలా ఎక్కువగా ఉంటుంది. వారి మధ్యన నీవు శాంతిగా ఉండగలగాలి.

మానవజాతిని అమితంగా ప్రేమించినవ్యక్తి బుద్ధుడు. రెండుచేతులతో పువ్వులు పట్టుకొని ఒకతను బుద్ధుడి దగ్గరకు వచ్చాడు. బుద్ధుడు అతనితో Drop It అంటున్నాడు,





అంటేవదిలెయ్యి అంటున్నాడు. ఆ భక్తుడు ఎడమచేతితో పుష్పాలు ఇవ్వకూడదు అనుకొని ఎడమచేతిలో ఉన్న పుష్పాలు వదిలేసాడు బుద్ధుడు మరలా వదిలెయ్యి, వదిలెయ్యి అంటున్నాడు. అప్పుడు ఆభక్తుడు కుడిచేతిలో ఉన్న పుష్పాలుకూడా వదిలేసాడు. మరల వదిలెయ్యి, వదిలెయ్యి అంటున్నాడు బుద్ధుడు. అప్పుడు ఆ భక్తుడు ఇంక నాదగ్గర వదిలేయటానికి ఏమీలేదు, మీరు ఎవరిని వదలమంటున్నారు. అని అడిగాడు. ఈపుష్పాలు నేను తెచ్చాను అని ఆనేనును మోసుకొని వచ్చావు, ఆనేనును వదిలెయ్యి అన్నాడు బుద్ధుడు. అప్పుడు కదా నీకు నిర్వాణసుఖం వచ్చేది, అప్పుడు నీవు నిజమైన సుఖివి అవుతావు అని చెప్పాడు. లోదృష్టి కలగటం కష్టం, దానికి సహకరించే వాడే గురువు. శివరాత్రి రోజున ఉపవాసం ఉండమని చెపుతారు అంటే శివుడికి దగ్గరగా ఉండమని చెప్పటం. ఆహారం తీసుకోవద్దని చెపుతారు అంటే నోటిద్వారానే కాదు, చెడుదృశ్యం చూస్తే మనకళ్ళ ద్వారా ఆచెడ్డ మనస్సులోనికి వెళ్లిపోతుంది. చెడ్డమాటవింటే అది కూడా ఆహారమే ఏఇంద్రియం ద్వారా నువ్వు తీసుకొన్నా అది ఆహారమే అని ఆచార్యులవారు చెప్పారు. అందుచేత శివరాత్రి రోజున ఏ ఆహారం తీసుకోవద్దు అని చెపుతారు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీవు మనస్సును నియమించుకొని, ఆయన నీహృదయంలో ఎంతలోతులలో ఉన్నాడో అక్కడకు నీ మనస్సును పంపగలిగితే అది నశిస్తుంది, భగవంతుడు నీకువ్యక్తమవుతాడు. మనం దేహంతో తాదాప్యం పొందటం వలన దేహవాసన, లోకంతో తాదాప్యం పొందటంవలన లోకవాసన పెరుగుతుంది. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని నిరంతరం స్మరించటం వలన నువ్వు పవిత్రుడవుతావు, నీకు ఏకాగ్రత కలుగుతుంది, లోచూపుకలుగుతుంది. సహృదయం, వివేకం, బుద్ధిసూక్ష్మత లేకుండా ఈశ్వరదర్శనం కాదు. మనం ఏదోబాహ్యమైన ప్రక్రియల వలన మోసంచేసి భగవదనుభవం పొందలేము. జ్ఞానఫలం మోక్షం. మహావైరాగ్యంలోనుండి, వివేకంలోనుండి అదిరావలసిందే గాని అక్కడ గోడ కట్టించాము, ఇక్కడ నుయ్యి తవ్వించాము అంటే అదిరాదు. మంచిపనులు చేయండి మంచిదే దానివలన పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది. కాని మోక్షం అలారాదు. దానికి బుద్ధిసూక్ష్మత ఉండాలి, వివేకబలం ఉండాలి, వైరాగ్యబలం ఉండాలి, పవిత్రత ఏకాగ్రత ఉండాలి, కాంక్షరహితుడు కావాలి ఇన్ని కలిసివస్తేగాని వాడు జ్ఞానసామ్రాజ్యానికి వారసుడు కాలేడు. మనం జాగ్రత్తగా ఉండి మనస్సును సంస్కరించుకోవాలి, మనలను మనం బాగుచేసుకోవాలి. నీకు ఏబలహీనతలు ఉన్నాయో వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచెయ్యి, నీవు కృషిచెయ్యి కృపవస్తుంది. కృషి లేకుండా కృపరాదు. వారిని వారు

బాగుచేసుకోవటానికి ఎవరైతే కృషి చేస్తున్నారో వారికి భగవంతుడు సహకారం అందిస్తాడు.

మనలోపల ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన ఒక్కడే స్వతంత్రుడు. సృష్టిస్థితి లయాలకు అతీతంగా ఉన్నవాడు ఆయన ఒక్కడే. మనకు నిజమైన స్వేచ్ఛకావాలంటే మన హృదయంలో ఉన్న ఈశ్వరుడిని మనం అనుభవంలోనికి తెచ్చుకోవాలి. నువ్వు సాధనచేసి, విచారణచేసి మూలతలంపును దాని మూలమైన హృదయంలోనికి పంపితే అది నశిస్తుంది, అక్కడఉన్న భగవంతుడు నీకు వ్యక్తమవుతాడు. నీహృదయంలో ఉన్నసత్యవస్తువును, భగవంతుడిని నీకు పట్టిఇచ్చేదే ఆత్మవిద్య. భగవదనుభవం పొందేవరకు నీకు సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. ఒక్కజ్ఞానిమాత్రమే నిజమైనసుఖి. భగవంతుడు నీకుకొన్ని అనుభవాలు పంపుతాడు. కొన్ని చెడుఅనుభవాలు రావచ్చు, కొన్నిఅనుభవాలు నీకు ప్రతికూలంగా ఉండవచ్చు. మీరు మార్గంలో ఉంటే, మీరు సత్యాన్వేషకులుగా ఉంటే ఆచెడుకూడా మంచికి దారితీసే అవకాశం ఉంది. మీకు కష్టాలు వస్తాయి. ఈకష్టాలు ఏమిటి అని మీరు అనుకొంటారు. ఆకష్టం మీ మనస్సును సత్యంవైపుకు, పరమాత్మవైపుకు త్రిప్తే అవకాశం ఉంది, అది తెలియక మీరు తొందరపడతారు. భగవంతుడికి ఎవరిపట్ల పక్షపాతం లేదు. రాగంవలన, ద్వేషం వలన మనస్సు బాహ్యాముఖానికి వెళుతుంది. నీమనస్సు ఎంతవరకు బాహ్యాముఖానికి వెళుతుందో అంతవరకు నీకు దేహాభిమానం పెరుగుతుంది, అహంభావన పెరుగుతుంది, కటికచీకటి లోనికి వెళతావు. నీవు దారిద్ర్యం అనుభవించినా, సంపదఅనుభవించినా నీమనస్సును కండిషన్‌లో పెట్టుకో, అప్పడు దారిద్ర్యంఏమిచేయలేదు, సంపదఏమిచేయలేదు. నీజీవితంలో వచ్చే హెచ్చుతగ్గులకు ఊగిసలాడుతూ ఉంటే నీమనస్సు కండిషన్‌లో లేదు అనిఅర్ధం. మీ ఇష్టాలకు, అయిష్టాలకు, కోపతాపాలకు, లాభనష్టాలకు, మీ బాధలకు వీటన్నింటికి అతీతంగా భగవంతుడు ఉన్నాడు. ఇవిఅన్నీ మీ దేహప్రారబ్దమునుబట్టి వస్తున్నాయి, ఇది అంతాస్వప్న సమానము. వీటికి భగవంతుడికి ఎట్టిసంబంధంలేదు. మీతో మాట్లాడేవారు ఎవరైనా మాట్లాడటం లేదనుకోండి మీకు దుఃఖంవస్తోంది అనుకోండి అదిలోకవాసన. మీకు సఫరింగ్ ఎందుకు వస్తోందో ఆకారణం మీకు అర్థంఅయితే ఆదుఃఖంమీకు రాదు. మీరు చిన్నమాటను భరించలేరు, ఇంక హృదయగుహలోనికి ఎలా వెళ్లగలరు. ఆత్మను పట్టుకొని జీవిస్తే ఆత్మ తెలియబడుతుంది. ఇప్పడు నీవు దేనిని పట్టుకొని జీవిస్తున్నావు. అహంభావనను పట్టుకొని జీవిస్తున్నావు. అహంభావనను పట్టుకొని జీవిస్తూ ఉంటే ఆత్మ ఎలా తెలియబడుతుంది అంటున్నారు భగవాన్. ఏతలంపు అయితే

దేహంతో తాదాప్యం పొందుతోందో ఆతలంపును పట్టుకొని జీవిస్తున్నావు. అలా జీవించినప్పడు నీకు ఆత్మానుభవం ఎలాకలుగుతుంది. ఏగ్రంథంచదివితే నీకు భగవదనుభవం పొందటానికి ఉపయోగపడుతుందో ఆగ్రంథం చదువు, భగవదనుభవం పొందినవాడి మాటలు అధ్యయనం చెయ్యి అంతేగాని దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన పెంచే గ్రంధాల జోలికి వెళ్లవద్దు.

నేను ఉన్నాను, నేను ఉన్నాను అని నీవు అనుకొంటున్నావు. నిజంగా నీవులేవు, అది తెలుసుకోవటమే జ్ఞానం. లేనిదానిని లేనట్లుగా తెలుసుకోవటమే జ్ఞానం అంటున్నారు. భగవాన్. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో అది ఉంటే చీకటి, అది లేకపోతే వెలుగు. ఇది అర్థంకావటానికి గురువు యొక్క దయకావాలి. ఈసృష్టిలో అన్ని దేహాలను ధరించినవాడు భగవంతుడే, అంతేకాదు ఈదేహాలను ఆడించేవాడు ఆయనే. మిమ్మల్ని మీభర్త తిట్టాడు అంటే తిట్టించినవాడు భగవంతుడే. మీలో ఎంతకోపం ఉందో మీకు చూపించటానికి భగవంతుడు ఆయనచేత తిట్టిస్తాడు. చేసేది అంతా భగవంతుడే . మీవేదన తగ్గాలంటే, మీమనస్సు చల్లబడాలి అంటే, మీ టెన్షన్ ఆగిపోవాలంటే ఈసృష్టిలో అన్నిరూపాలలో ఉన్నవాడు భగవంతుడే అని మీకు అర్థమవ్వాలి. అప్పడు మనం ఎవరిని ద్వేషిస్తాము, ఎవరి మీద కోపగించుకొంటాము. సమాజంలో మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు. మంచివారిని ఇంకా మంచివారుగా చేయటానికి భగవంతుడుచెడ్డవారిని ఉపయోగించుకొంటాడు, వారి పాత్రకూడా ఉంది. అన్ని దేహాలు, మనస్సులు ఆయన స్వాధీనంలో ఉన్నాయి. ఉన్నది ఆయనే. మేము ఎప్పడు సుఖపడుతాము అని అడుగుతున్నారు. డబ్బు ఉన్నవాడికి, డబ్బులేనివాడికి, చదువుకొన్నవాడికి, చదువులేనివాడికి, ఉద్యోగస్తుడికి, ఉద్యోగం లేనివాడికి అందరికి ఇదే గోల. ఈతలంపు ఎక్కడ నుండి వస్తోంది? దేహము నేను అనే తలంపు నుండి వస్తోంది. నేను ఎప్పడు సుఖపడతాను అని మీరు అనుకొంటూఉంటే మీకు దేహవాసన ఎక్కువగా ఉంది అని అర్థం. మీరు ఎవరిని సుఖపెడదామని, ఈశవాన్ని సుఖపెట్టాలని మీ ఉద్దేశం. ఇంకా సుఖపడాలి అనుకొంటూ ఉంటే మనకు తెలియకుండా అహంకారం యొక్క వాపు పెంచుకొంటున్నాము. ఇప్పడు మన శవాలు చించినాడలో ఉన్నాయి. కాని మనం ఎక్కడ ఉన్నాము, బ్రహ్మంలోనే ఉన్నాము. బ్రహ్మంలోనే ఉండి బ్రహ్మంకోసం వెతుక్కొంటున్నాము. బ్రహ్మంలోనే ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. ఈచిన్నతలంపును ఓవర్‌కమ్ చేయటానికి లక్షలాది జన్మలు పట్టవచ్చు. ఈశ్వరానుగ్రహం లేకపోతే

ఈవేరుబుద్ధిలో నుండి విడుదలపొందలేము. మీరు 364 రోజులు భోగదృష్టిలో ఉన్నా, లోకానికి దగ్గరగా ఉన్నా కనీసం మహాశివరాత్రి రోజున అయినా యోగదృష్టిలో ఉండండి, శివుడికిదగ్గరగా ఉండండి. శివుడు ప్రేమస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు. ఆయనకు ఏమీ అక్కరలేదు, అందరికి అన్నీ ఇస్తాడు, వాడు శివుడు. ఆయన గుప్తంగా ఉన్నాడు కాబట్టి ఆయనను తెలుసుకోవటం గహనంఅవుతోంది అంటే కష్టమవుతోంది. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనకులోచూపు లేదు కాబట్టి ఆయన మనకు తెలియటంలేదు, లోచూపు ఉన్నవారికి ఆయన ఎఱుకలోనికి వస్తాడు. భగవంతుడు ఉన్నాడు, మనం లేము. ఇది మనకు అర్థంకావాలి. మనం ఏమనుకొంటున్నాము అంటే భగవంతుడులేడు, మనం ఉన్నాము అనుకొంటున్నాము. ఈ తిరకాసు ఎంతకాలం అయితే పరిష్కారం కాదో అంతకాలం మనకు పునర్జన్మలు వస్తాయి, శవాలను మోయవలసిందే.

---

**తిరువణ్ణామలై**
**17-2-2003**

పూజ్య గురుదేవా...

5 సంవత్సరముల క్రితము, నేను మొట్టమొదటిసారిగా భారతదేశము వచ్చినప్పుడు -"ఏదో ఒకరోజున గురువు యొక్క అనుగ్రహము నామీద వర్షిస్తుందని, నా స్వరూపమైన ఆత్మయొక్కఅనుభూతిని నేను పొందుతానని, 18 నెలలు ఏకాంతవాసములో ఆమధురానుభూతి నన్ను హృదయగుహలోనికి నడిపిస్తుందని" -అనిపించినది.

2003 ఫిబ్రవరి 15వ తేదీన, మౌనదీక్షలో మీరు కూర్చొని ఉన్నప్పుడు, మీ సాన్నిధ్యములో కూర్చున్న నాకు -"బోధిసన్! ఇప్పుడు నీవు పక్వానికి వచ్చావు. నీ స్వప్రయత్నము ఎంతదూరమైతే నిన్ను తీసుకువెళ్లగలదో - అంతదూరము తీసుకువెళ్లినది. ఇక మీదట గురువుపట్ల నీకుఉన్న విశ్వాసము, ధృడమైన నమ్మకమే మిగిలిన ప్రయాణము పూర్తిచేసి, నిన్ను గమ్యము చేరుస్తుంది." అన్న మీ సందేశము నాకు వినిపించింది.

"వెతకండి - దొరుకుతుంది, తట్టండి - తలుపు తెరువబడుతుంది, అడగండి - అది మీకు ఇవ్వబడుతుంది." -అని జీసస్ చెప్పాడు. ఇన్నాళ్ళు శ్రవణము చేస్తూ వెదికాను, మననము చేస్తూ తడుతున్నాను ఇక యిప్పుడు నిధిధ్యాస నాకు కుదిరి, అది నన్ను గమ్యము చేర్చుటకు - నాస్వరూపమైన ఆత్మయొక్క అనుభూతిని గురుదేవులైన మీరు నాకు అనుగ్రహిస్తారని విశ్వసిస్తున్నాను.

ప్రియతమ గురుదేవా! నా మనస్సు అంతర్ముఖమై, ఆత్మనిష్టకుదిరి, సహజసమాధిలో స్థిరపడుటకు - నాకు ఆచైతన్య స్పర్శను ప్రసాదించమని మిమ్ము ప్రార్థిస్తున్నాను. ఏప్రియల్ నెలలో నేను హవాయ్ వెళ్లినప్పుడు - ఆ మహాద్భాగ్యాన్ని నాకు అనుగ్రహించి, నన్ను హృదయగుహను చేర్చి, ఆ చైతన్యస్రవంతిలో నన్ను మిళితము చేయమని వేడుకుంటున్నాను.

ఒకవేళ నేను పక్వానికి రాకపోతే - రెండు రోజుల క్రితము మీ మౌనసాన్నిధ్యములో నాకు వినిపించిన మీ మాటలు కేవలము నా భ్రాంతే గనుక అయితే - దయఉంచి నేను ఇంకా పక్వానికి రాలేదని చెప్పండి. ఇంకా ఏవిధముగా నేను ఎక్కువ సాధన చేయాలో చెప్పండి. "నేను ప్రయత్నము చేయాలి" అనే తలంపు కూడా లేనటువంటి సహజసాధన జరిగే శక్తిని నేనెట్లు పొందగలనో అనుగ్రహించండి.

లేదా, నేను పక్వానికి వచ్చి ఉన్నట్లయితే - మీ మౌనసందేశాన్ని నిజము చేయండి. ప్రయత్నముతో నిమిత్తములేని సహజసాధనకు నాకు దారిచూపండి. ఏప్రియల్‌లో, హవాయ్‌లో జరిగే సమావేశములో, ఏచైతన్యస్పర్శ కోసమైతే నేను పరితపిస్తున్నానో - ఆ స్థితిని నాకు ప్రసాదించండి. అలా వీలు పడకపోతే, కనీసము ఇంకా నేను ఆమధురానుభూతి కోసము ఎంతకాలము వేచియుండాలో నాకు అర్థమయ్యేటట్లు అనుగ్రహించండి.

రమణమహర్షిలా, అరుణాచలేశ్వరుడిలా, ఆత్మస్వరూపులై, దేహము ధరించియున్న ఓ నా ప్రియతమ గురుదేవా! మీరు నా హృదయవాసియై, నన్నీస్థితికి నడిపించి, ఊహలకే అతీతమైన అపురూపమైన కోరికను కోరేశక్తిని నాకు ప్రసాదించారు. నాకు ఆత్మయొక్క అనుభూతిని అనుగ్రహించి, నా అహంకారాన్ని హరించి, ఈ దేహము ద్వారా ఆ చైతన్యము పనిచేసేటట్లు కరుణించమని, ఆత్మనిష్టలో నేను జీవించేటట్లు అనుగ్రహించమని మిమ్ములను వినయముతో వేడుకుంటున్నాను.

వినయ విధేయభక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తూ

మీ
**బోధిసన్**

(అనువాదము - డా॥ కె. రామారావు)